అలైన్‌మెంట్ మార్చలేం..
పరిహారం ఎక్కువ ఇస్తాం

భువనగిరి, న్యూస్‌టుడే: ముందుగా పరిహారం ఎంత ఇస్తారో స్పష్టం చేయండి.. బహిరంగా మార్కెట్ ధర ప్రకారం నిర్ణయించాలి. ఆ తదుపరి సర్వేకు అనుమతిస్తామని రాయగిరి గ్రామానికి చెందిన ప్రాంతీయ వలయ రహదారిలో భూములు కోల్పోతున్న రైతులు స్పష్టం చేశారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన, కలెక్టర్ అనురాజ్ జయంతి, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. వెంకారెడ్డి సమక్షంలో సంబంధిత రైతు ప్రతినిధులతో కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం చర్చలు జరిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మంత్రి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి అలైన్‌మెంట్ మార్పిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని రైతులు గుర్తు చేశారు. సమావేశంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు అప్పటి విషయాలు ఇప్పుడెందుకని అనడంతో వారికి రైతుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. "అప్పట్లో హామీ ఇచ్చిన విషయం వాస్తవమే.. కానీ అప్పటికే అలైన్‌మెంట్ పూర్తయ్యింది. అన్ని గ్రామాల్లో పరిహారం కూడా నిర్ణయించడం జరిగింది. ఇప్పుడు అలైన్‌మెంట్ మార్చలేం. జిల్లాలో మిగిలిన ప్రాంతాల కన్నా ఎక్కువ పరిహారం ఇప్పించి న్యాయం చేస్తాం." అని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి వారికి నచ్చజెప్పారు.

● 2019లో రాయగిరి సర్వే నంబరులో మాజీ ప్రజాప్రతినిధి రూ.65 లక్షలకు ఎకరం చొప్పున కొనుగోలు చేసి విషయాన్ని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆ రిజిస్ట్రేషన్ పత్రాన్ని కలెక్టర్‌కు సమర్పించారు. ఈ ధర ప్రకారం పరిహారం నిర్ణయించాలన్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ.. ముందుగా సర్వేకు అనుమతించాలని, ఆర్డీవో వద్ద అవార్డు పాస్ చేశాక ఆర్బిట్రేషన్‌కు వస్తే ధర నిర్ణయించడం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సమావేశం ఫొటోలు తీస్తుండగా గన్‌మెన్లు అడ్డుకున్నారని, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

బండెనక బండి.. భాగ్యనగరికేనండి



హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ సోమవారం కూడా కొనసాగింది. హైదరాబాద్ మార్గంలో వాహనాలు ఒకదాని వెనుక ఒకటి బారులు తీరాయి. రాఖీ పండగ, శుభకార్యాలకు సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు పట్నం బాట పడుతున్నారు. చౌటుప్పల్‌లో అండర్‌పాస్ వంతెన పనులు నడుస్తుండటంతో వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగుతున్నాయి. పోలీసులు, హైవే సిబ్బంది వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా వాహనాల రాకపోకలను పునరుద్ధరిస్తున్నారు.
– న్యూస్‌టుడే, చౌటుప్పల్‌గ్రామీణం

"హలో బ్రదర్.. మేం గుట్టకు వస్తున్నాం. స్వామి దర్శనం, భోజనం, బస ఏర్పాట్లు నీవే చూడాలి. ఒకే అన్నా.. ఎందరు వస్తారు.. కారు నంబరు, భోజన మెనూ వివరాలు పంపించండి. అన్నీ నేను చూసుకుంటా. ప్రత్యేక దర్శనం 10 మందికైతే రూ.2 వేలు ఫోన్‌పే చేయండి."

నిఘా

దర్శనాల దందా!

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే:

యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో దళారి, క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తుడి మధ్య జరిగిన సంభాషణ ఇది. దైవసన్నిధిలో గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్న దళారుల దందా ఇది. టోల్ ఫీజు లేకుండానే కారులోనే కొండపైకి తీసుకెళ్లడం, నేరుగా దైవ దర్శనం చేయించడం, వేదాశీర్వచనం, వీలైతే స్వామివారి అన్న ప్రసాదం ఇప్పిస్తుంటారు. వీరు ఎక్కడా టికెట్లు తీసుకోవడం లేదు. ఇలా ప్యాకేజీ నిర్ణయించి దందాలు చేస్తున్నారు.

డబ్బులిస్తే నేరుగా యాదగిరీశుడి చెంతకు

● రియల్ ఎస్టేట్ బ్రోకర్లు, చోటా మోటా లీడర్లు భక్తులతో ప్యాకేజీలు మాట్లాడుకుని ఆలయాధికారుల్లో కొందరిని మచ్చిక చేసుకుని దందా కొనసాగిస్తున్నారు. కొండ కింద బసచేసే ప్రైవేటు లాడ్జిలు, సత్రాలు, ఆలయ కాటేజీల చెంత దైవారాధనలను నేరుగా కల్పించే దళారులు తిరుగుతుంటారు. కుటుంబాలతో వచ్చిన భక్తులను కలిసి ప్యాకేజీ మాట్లాడుకుంటారు. కొండపైకి పంపించేందుకు ఓ బ్యాచ్ ఉండగా, కొండపైన దర్శనానికి పంపించేందుకు మరో బ్యాచ్ పని చేస్తుంటుంది. ఇలా గొలుసుకట్టు వ్యవస్థ నిత్యం కొనసాగుతూనే ఉంది. దర్శనాలకు భక్తులను పంపించే వ్యవస్థ పటిష్ఠంగా లేకపోవడంతో ప్రతి రోజూ ఆలయ ఆదాయానికి గండి పడుతోంది. శ్రావణ మాసంలో దళారుల పంట పండుతోంది.

● హైదరాబాద్ నగరం నుంచి 11 మందితో కూడిన ఓ కుటుంబం ఇటీవల క్షేత్ర సందర్శనకు వచ్చింది. కొండ కింద ఓ ప్రైవేట్ లాడ్జిలో బస చేసి ఉదయాన్నే దైవ దర్శనం చేసుకోవాలని సంకల్పించారు. లాడ్జి వారిని సంప్రదించగా ఆయన ఫోన్ చేసి ఓ వ్యక్తిని పిలిపించి, పరిచయం చేశారు. ఆ వ్యక్తితో కొండపైకి వెళ్లి గంటలోపే దైవ దర్శనం చేసుకొని వచ్చారు. ఇందుకు రూ.1500 చెల్లించారు.

మూడేళ్లుగా దర్శనం టికెట్ల ఆదాయం

శీఘ్ర దర్శనం (టికెట్ ధర రూ.150)	
2023–24	రూ.10,28,91,900
2024–25	రూ.13,59,82,050
2025–26	రూ..12,80,77,800
బ్రేక్ దర్శనం (టికెట్ ధర రూ.300)	
2023–24	రూ.7,62,27,900
2024–25	రూ.7,42,54,700
2025–26	రూ.7,55,04,900

ఈవో వివరణ: దైవదర్శనంలో కొనసాగుతున్న దందాను అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపడతాం. నిఘా వ్యవస్థను పెంపొందిస్తాం. ఈ సమస్యను ట్రస్టుబోర్డు దృష్టికి తెచ్చి కట్టుదిట్టమైన విధానాల అమలుకు ఆదేశిస్తామని ఈవో భవానీశంకర్ తెలిపారు.

ఆన్‌లైన్‌లో కొంటే అంతే

● పురుగు మందులు ఖరీదు చేసి నష్టపోతున్న రైతులు

'గతేడాది రాజపేట మండలం సోమారం గ్రామానికి చెందిన ఒక రైతు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన పురుగు మందును పత్తి పంటపై పిచికారీ చేయడంతో పంటలో చాలా భాగం ఎండిపోవడంతో నష్టపోయాడు. గుండాల మండలానికి చెందిన రైతు కూడా ఇదే విధానంలో మోసపోయాడు.'
– ఆలేరు, న్యూస్‌టుడే:

యాదాద్రి జిల్లాలో ఏటా సీజన్‌లో రూ.35 కోట్ల వరకు పురుగు మందుల వ్యాపారం జరుగుతోంది. వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి, ఉద్యాన పంటలపై పురుగులు, తెగుళ్ల నివారణకు పురుగు మందులు వినియోగిస్తుంటారు. ఈ సారి 1.90 లక్షల ఎకరాల్లో వరి, 1.10 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. రసాయన మందుల తయారీ కంపెనీలు ఆన్‌లైన్ వేదికగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. తమ బ్రాండ్ వాడితే అధిక దిగుబడి వస్తుందని పేర్కొంటున్నాయి. కొందరు రైతులు వాటిని కొనుగోలు చేస్తూ పంటలకు ఉపయోగిస్తున్నారు. చివరకు నష్టపోతున్నారు.

● కొందరు రైతులు తక్కువ ధరకు వస్తున్నాయనే భావనతో వ్యవసాయ మందులను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నారు. స్థానిక దుకాణాలతో పోలుస్తూ రూ.50 నుంచి రూ.100 వరకు తక్కువ ధరకు వస్తున్నాయని ఆశపడుతూ కొనుగోళ్ల వైపు ఆసక్తి చూపుతున్నారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన మందులు అసలైనవేనా? డబ్బాపై పేర్కొన్న మందే లోపల ఉంటుందా అనే విషయాలను రైతులు నిర్ధారించుకోవడం కష్టం. లైసెన్స్ కలిగిన విశ్వసనీయ దుకాణాల నుంచే కొనుగోలు చేసి అవసరమైనప్పుడు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు తీసుకోవడం మంచిది.

లైసెన్స్ ఉన్న డీలరు వద్ద కొనుగోలు చేయాలి

– ఎస్.శ్రీనివాస్, ఎంఏవో, ఆలేరు

ఆన్‌లైన్‌లో పురుగు మందులు కొనుగోలు చేస్తే ఏది అసలో, ఏది నకిలీనో గుర్తించడం కష్టం. ప్రభుత్వ పరంగా లైసెన్స్ ఉన్న డీలరు వద్దనే కొనుగోలు చేయాలి. రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలి. అధిక దిగుబడులు వస్తాయని ఆన్‌లైన్‌లో చేసే ప్రచారాన్ని రైతులు నమ్మొద్దు. పంటలు దెబ్బతింటే తదుపరి చర్యలకు ఆధారాలు ఉండవు.

సాగుకు సలహాలిచ్చే నాథుడేరీ?

జిల్లా వ్యవసాయశాఖలో సిబ్బంది కొరత

భువనగిరి, భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయ శాఖలో సిబ్బంది కొరత వెంటాడుతోంది. జిల్లా, డివిజన్ కార్యాలయాల్లో ఏడీఏ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పర్యవేక్షించే అధికారులు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నివేదికల తయారీ, కరవు పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రత్యేక పథకాల అమలు పర్యవేక్షణ కొరవడింది. క్లస్టర్లలో సహాయ వ్యవసాయ విస్తరణ అధికారుల పోస్టులు కూడా నెలల తరబడి ఖాళీగా ఉన్నాయి. క్లస్టర్ ఏఈవోలకు అదనపు బాధ్యతలు అప్పగించి పనులు నెట్టుకొస్తున్నారు.

● జిల్లాలో నాలుగు అంచెల్లో అధికార వ్యవస్థ ఉంది. జిల్లా కేంద్రంలో జిల్లా వ్యవసాయ అధికారి, ఒక ఏడీఏ(టెక్నికల్), నలుగురు ఏవోలు(టెక్నికల్) ఉన్నారు. భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్టలో డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. వీటికి సహాయ సంచాలకుడు(ఏడీఏ), టెక్నికల్ ఏవోలు ఉంటారు. మండలానికి ఒక ఏవో చొప్పున 17 మండల వ్యవసాయ అధికారులు ఉన్నారు. 92 క్లస్టర్లు ఉండగా ఒక్కో క్లస్టర్‌కు ఒకరు చొప్పున ఏఈవో పోస్టులను నియమించాల్సి ఉంది. జిల్లాలో పనిచేస్తున్న నలుగురు సహాయ సంచాలకులు డిప్యూటీ డైరెక్టర్లుగా పదోన్నతి పొంది సుమారు ఆరు నెలల క్రితం బదిలీ అయ్యారు. వారి స్థానాల్లో ఇంకా పూర్తిస్థాయి నియామకాలు చేపట్టలేదు. అదనపు బాధ్యతలతో నిర్వహిస్తున్నారు. అన్ని శాఖల్లో జూన్ నెలలోనే సాధారణ బదిలీల ప్రక్రియ జరిగినా.. వ్యవసాయ శాఖలో ఇంత వరకు ఏడీఏలు, ఏవోల బదిలీలు చేపట్టనేలేదు. పదోన్నతులు, బదిలీలు నిలిచిపోయి.. ఖాళీలను భర్తీ చేయలేదు. ఏఈవోలు, మినిస్టీరియల్ స్టాఫ్‌ను బదిలీ చేశారు.

పదోన్నతులపై బదిలీలు..

జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ఏడీఏ టెక్నికల్ నీలిమ, ఆలేరు ఏడీఏ పద్మావతి, భువనగిరి వెంకటేశ్వరరావు, యాదగిరిగుట్ట ఏడీఏ శాంతి నిర్మలకు డిప్యూటీ డైరెక్టర్లుగా పదోన్నతి పొంది బదిలీ కావడంతో ఈ పోస్టులు ఇప్పటి వరకు ఇన్‌ఛార్జిలతో కొనసాగుతున్నాయి. ఆలేరు సబ్ డివిజన్ రెగ్యులర్ ఏడీఏగా నిర్మలను నియమించారు. భువనగిరికి ఇటీవల భిక్షపతి అనే అధికారిని డిప్యుటేషన్‌పై ఏడీఏగా నియమించారు. యాదగిరిగుట్ట ఏడీఏ పోస్టు కూడా ఖాళీగా ఉంది. ఇక జిల్లాలో కేంద్రంలో ఏడీఏ టెక్నికల్ పోస్టులో ఏవో టెక్నికల్ ఇన్‌ఛార్జిగా కొనసాగిస్తున్నారు.

● క్షేత్ర స్థాయిలో పనులు పర్యవేక్షించే వ్యవసాయ విస్తరణ అధికారుల పోస్టులు చాలా వరకు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో 92 పోస్టులు ఉండగా 14 ఖాళీలుగా ఉన్నాయి. రైతులకు ఇబ్బంది కలగకుండా ఉన్న సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగించి పనులు చేయిస్తున్నామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పి.వి.రమణారెడ్డి 'న్యూస్‌టుడే'తో చెప్పారు.

వాహనం కదలాలంటే.. కాలుష్యపత్రం ఉండాల్సిందే

● యాదగిరిగుట్టకు చెందిన వ్యక్తి రెండేళ్లుగా తన ద్విచక్రవాహనానికి పొల్యూషన్ పత్రం తీసుకోలేదు. ఇటీవల ట్రాఫిక్ పోలీసుల తనిఖీ చేయగా సదరు పత్రాన్ని చూపలేక పోయాడు. జరిమానా చెల్లించాల్సి వచ్చింది.

● ఆలేరు పట్టణానికి చెందిన ఓ యువతి తన స్కూటీకి ఐదేళ్ల గ్రీన్ పర్మిట్‌కు సడలింపు ఇవ్వాలని రవాణా శాఖ అధికారులకు దరఖాస్తు చేశారు. సదరు వాహనానికి పీయూసీసీ పత్రం లేకపోవడంతో అధికారులు దరఖాస్తును తిరస్కరించారు.

ఆలేరు, న్యూస్‌టుడే: వాహన కాలుష్య నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. పక్కాగా అమలు చేయాలని, ప్రతీ వాహనానికి పొల్యూషన్‌కు సంబంధించిన పత్రాలు ఉండాలని మార్గదర్శకాలలో పొందుపర్చారు. వ్యక్తిగత, రవాణా వాహనాలను ఎప్పటికప్పుడు పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్(పీయూసీసీ) పొందాలని స్పష్టం చేసింది. ఈ విషయంలో రవాణా శాఖ యంత్రాంగం ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని మార్గదర్శకాలలో పేర్కొన్నారు.

ఇలా చేయాలి.. ● బీఎస్-6 వాహనాలకు ప్రస్తుతం ఏడాదికి ఒక్కసారి పీయూసీసీ తీసుకుంటున్నారు. ఇక నుంచి మూడేళ్లకోసారి తీసుకుంటే సరిపోతుంది. ● కొత్త వాహనం కొనుగోలు చేసిన ఆరేళ్లలోపు రెండు సార్లు చేయించాలి. ఆ తర్వాత పదేళ్ల వరకు ఏడాదికోసారి చేయించాలి. పదేళ్లు దాటాక ప్రతి ఆరు నెలలకు ధ్రువపత్రం పొందాల్సి ఉంటుంది. ● బీఎస్ 1,2,3,4 రకం వాహనాలకు ఇప్పుడు ఆరు నెలలకోసారి పరీక్షలు చేయిస్తున్నారు. ఇక నుంచి మూడు నెలలకోసారి చేయించి పీయూసీసీ పొందాలి.

యాదాద్రి జిల్లాలో వాహనాల వివరాలు...

- ద్విచక్ర వాహనాలు: 2.10 లక్షలు
- ఆటో రిక్షాలు: 16,000
- కార్లు, తక్కువ బరువున్న వాహనాలు: 26,500
- ట్రాక్టర్లు, వ్యవసాయ వాహనాలు: 15,000
- భారీ వాహనాలు (బస్సులు, లారీలు, గూడ్సు వాహనాలు): 8,800

నిర్లక్ష్యం చేయడం తగదు

వాహనాలను రవాణా, ట్రాఫిక్ పోలీసులు తనిఖీ చేసే సమయంలో ఎక్కువ శాతం చోదకుల వద్ద పొల్యూషన్ పత్రాలు ఉండటం లేదు. వాహనాన్ని బట్టి రూ.500 వరకు జరిమానా చెల్లించాల్సి వస్తుంది. నిర్ణీత సమయంలో పత్రం పొందే విషయంలో వాహనదారులు చాలా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రమాదాల సమయం, వాహనాల మార్పుల విషయంలో పత్రం లేకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.

రైతేరాజు 6లో..

చెరువులు నిండితేనే చేప!

● అడుగంటుతున్న జలవనరులు ● ఆందోళనలో మత్స్య కారులు

ఈనాడు, నల్గొండ: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆశించిన వర్షాలు లేకపోవడంతో చెరువులు దాదాపుగా అడుగంటాయి. చేపల ఉత్పత్తికి కావాల్సిన నీటినిల్వలు లేవు. దీంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూసీ, సాగర్ పరివాహక చెరువుల్లో నీటినిల్వలు కొద్ది మేర మాత్రమే ఉన్నాయి. మునుగోడు, కనగల్, చండూరు, దేవరకొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, తిరుమలగిరి, కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి, చిట్యాల, చౌటుప్పల్, భువనగిరి, నల్గొండ నియోజకవర్గాల్లో చెరువుల్లో వరదనీరు చేరకపోవడంతో ఆయా ప్రాంతాల్లో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చేపపిల్లల పంపిణీ ఆలస్యం

- నల్గొండ జిల్లావ్యాప్తంగా 1,167 చెరువుల్లో 5.98 కోట్ల చేప పిల్లల పంపిణీ లక్ష్యంగా టెండర్లు పిలిచినా జలాశయాల్లో నీరు లేని కారణంగా సరఫరా ప్రక్రియ వాయిదా వేశారు. గుత్తేదారులు సైతం ముందుకు రావడం లేదు.
- సూర్యాపేట జిల్లాలో 621 చెరువుల్లో 3.41 కోట్ల మేరకు వదలాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. కనీస నీటినిల్వలు లేక అధికారులు పంపిణీకి వెనుకంజ వేస్తున్నారు.
- యాదాద్రి జిల్లాలో 661 చెరువుల్లో 2.81 కోట్ల చేప పిల్లలను వదలాలని అనుకున్నా నీటి లభ్యత తక్కువగా ఉండటంతో వాటిని సరఫరా చేసేందుకు ముందుకు రావడం లేదు.

ప్రతిపాదించిన చేప పిల్లల పరిమాణం, పంపిణీ లక్ష్యం(లక్షల్లో)

జిల్లా	35–40 ఎం.ఎం.	చెరువులు	80–100 ఎం.ఎం.	చెరువులు
నల్గొండ	178.02	956	420.16	211
యాదాద్రి	141.75	511	140.41	150
సూర్యాపేట	976.78	431	243.50	190

నీటి నిల్వలు లేక ఎండిపోయిన కనగల్ మండలంలోని కురంపల్లి చెరువు

నష్టపరిహారం అందించాలి

– కనుకు వెంకటనారాయణ, నల్గొండ జిల్లా మత్స్యశాఖ జిల్లా ఛైర్మన్

ఎల్‌నినో కారణంగా మూసీ, సాగర్ పరివాహక ప్రాంతంలోని పెద్దచెరువుల్లో మినహా ఎక్కడా నీటి నిల్వలు సమృద్ధిగా లేవు. చేపలు వృద్ధి చెందాలంటే నీటి నిల్వలు ఎక్కువగా ఉండాలి. నిల్వలు సరిగా లేకనే ఉచిత చేపపిల్లల పంపిణీ ఉండదని అధికారులు చెబుతున్నారు. మత్స్యకారులకు ఉపాధి కరవైన నేపథ్యంలో ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి.

నిల్వలు పెరిగితేనే సరఫరా

– సుకీర్తి, జిల్లా మత్స్యశాఖ అధికారి, నల్గొండ

జలాశయాల్లో నీటినిల్వలు తగ్గిపోవడంతో ఈసారి చేపలపిల్లల విడుదల ఆలస్యం కానుంది. అంతా సిద్ధంగా ఉన్నా గుత్తేదారులు నీటి నిల్వల గురించి ఆందోళన చెందుతున్నారు. వర్షాలు పడి నీరు సమృద్ధిగా చేరితేనే పంపిణీ చేస్తాం.

విదేశీ విద్యకు
సువర్ణావకాశం

ఆలేరు, న్యూస్‌టుడే: ప్రపంచ స్థాయి విద్యను అభ్యసించాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థుల కలలను సాకారం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం మహాత్మా జ్యోతిబాపులే ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా అవకాశాన్ని కల్పిస్తోంది. ఈ పథకం ద్వారా అర్హత కలిగిన విద్యార్థులు విదేశాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ, ఇతర ఉన్నత విద్యా కోర్సులు అభ్యసించడానికి ప్రభుత్వం గరిష్ఠంగా రూ.20 లక్షలు అందిస్తోంది.

అర్హతలు.. అభ్యర్థులు తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారై ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉండాలి. ● కుటుంబంలో ఒకరికే ఈ స్కాలర్‌షిప్ ఇస్తారు. విద్యార్థి వయస్సు 35 సంవత్సరాలకు మించకూడదు. ● అకడమిక్ డిగ్రీ/గ్రాడ్యుయేషన్‌లో కనీసం 60 శాతం మార్కులు పొంది ఉండాలి. ● అర్హత పరీక్షలు జీఆర్ఈ-260 లేదా జీమ్యాట్-500 ● టోఫెల్-60 లేదా ఐఈఎల్‌టీఎస్-6.0 లేదా పీటీఈ-50.

350 మంది విద్యార్థులకు ప్రయోజనం

ఈ పథకంలో మొత్తం 350 మందికి ప్రయోజనం కల్పిస్తారు. 250 మంది బీసీ, 100 మంది ఈబీసీ విద్యార్థులను ఎంపిక చేస్తారు. గరిష్ఠంగా రూ.20 లక్షలు లేదా యూనివర్సిటీ అడ్మిషన్ పత్రంలో ఉన్న ఫీజు (ఏది తక్కువైతే అది). మంజూరైన సొమ్మును రెండు విడతల్లో అందిస్తారు. మొదటి విడతను విదేశాల్లో ల్యాండింగ్ అయినప్పుడు పర్మిట్/ఐడి కార్డు సమర్పించినప్పుడు. రెండో విడతగా రూ.10 లక్షలు మొదటి సెమిస్టర్ ఫలితాలు సమర్పించిన తర్వాత. వన్-వే ఎకానమీ క్లాస్ విమాన టికెట్, వీసా, ఫీజు రీయింబర్స్‌మెంట్ లభిస్తాయి.

దరఖాస్తు విధానం

అర్హతగల విద్యార్థులు తెలంగాణ ఈ-పాస్ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ప్రక్రియ సెప్టెంబరు 1, 2026న ప్రారంభమవుతుంది. తుది గడువు 30 సెప్టెంబరు 2026.

గుట్ట క్షేత్రంలో శ్రావణ ఆరాధనలు

శివాలయంలో ఆరాధన

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో సోమవారం హరిహరులను కొలుస్తూ, ఆరాధన పర్వాలను ఆయా ఆలయాల్లో విశేషంగా చేపట్టారు. ప్రధాన ఆలయంలో స్వయంభువులను ఆరాధిస్తూ నిత్య పూజలు ఆస్థాన, ఆర్జిత సేవలు కొనసాగాయి. అష్టభుజి మండప ప్రాకారంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం గరుడ వాహనంపై శ్రీస్వామి, ముత్యాల పల్లకీపై అమ్మవారు అలంకృతులై సేవోత్సవం పొందారు. శ్రీపర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, బిల్వపత్రాలతో ప్రత్యేక అర్చన, శివ, పార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: జర్మనీ దేశంలో ఫిజియోథెరపిస్ట్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారిణి పద్మ తెలిపారు. బీపీటీ, ఎంపీటీ పూర్తి చేసి 43 సంవత్సరాలలోపు ఉన్న అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులని ఆమె తెలిపారు. దరఖాస్తులను tom-comglobal @gmail.comకు సమర్పించాలని ఆమె తెలిపారు.

పరీక్షలు ఇక్కడ..
దిద్దేది అక్కడ

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఏ-1, 2 పరీక్షలకు సంబంధించిన సమాధాన పత్రాలను ఇది వరకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులే మూల్యాంకనం చేసి మార్కులు కేటాయించేవారు. ఇక నుంచి ఆ పరిస్థితి ఉండదు. 'ఎక్స్‌టర్నల్ ఎవాల్యుయేషన్ సిస్టం' పేరిట విద్యాశాఖ కొత్త విధానానికి రూపకల్పన చేసింది. ఈ మేరకు శాఖాపరంగా తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ విద్యా సంవత్సరం నుంచే నూతన విధానం అమల్లోకి రానుంది. మార్కుల కేటాయింపులో పారదర్శకత, మూల్యాంకనంలో జవాబుదారీ తనం పెంపొందించేందుకు ఇది దోహదపడనుందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత వివరాలు క్లుప్తంగా..

పాఠశాలలు, విద్యార్థులు, మూల్యాంకన నిధులు (రూ.లల్లో)..

జిల్లా	మండలాలు	పాఠశాలలు	విద్యార్థులు	నిధులు
నల్గొండ	33	1215	62,402	23,14,418
సూర్యాపేట	23	884	40,486	15,31,866
యాదాద్రి	17	672	37091	1352694

ఎంఈవోలు, హెచ్‌ఎంలు చేయాల్సింది

- పరీక్షల నిర్వహించడం, జవాబుపత్రాలు సేకరించడం, హాజరుతో వాటిని సరిపోల్చడం, తరగతి, సబ్జెక్టు వారీగా సమాధానపత్రాలు ఏర్పాటు చేయడం, వాటిని జాగ్రత్తగా సీల్‌చేసి, గుర్తింపు వివరాలను కవర్‌పై నమోదు చేయడం, ఎమ్మార్సీలో అప్పగించడం ప్రధానోపాధ్యాయుడి విధి.
- పాఠశాలల నుంచి వచ్చే సీల్డ్ కవర్లను స్వీకరించడం, వాటిని సరిచూసుకోవడం, రసీదు ఇవ్వడం, రిజిస్టర్ నిర్వహించడం, సమాధానపత్రాలు జాగ్రత్తగా భద్రపరచడం, సీల్ జాగ్రత్తగా ఉందో లేదో చూడటం, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత తరగతుల వారీగా మూల్యాంకన బాధ్యులను నియమించడం, ఆన్‌లైన్ నమోదు సకాలంలో జరిగేలా చూడటం మండల విద్యాధికారి బాధ్యత. జిల్లా విద్యాధికారి ప్రగతిని పర్యవేక్షించి మండలాల వారీగా సమీక్షించాల్సి ఉంటుంది.

రాజపేట: నెమిల ప్రాథమిక పాఠశాల తరగతి గదిలో విద్యార్థులు..

ఎక్స్‌టర్నల్ ఎవాల్యుయేషన్ సిస్టం విధాన క్రమం ఇలా..

- పరీక్షలు ఎప్పటిలాగే ఆయా పాఠశాలల్లో జరుగుతాయి. సమాధాన పత్రాలను ప్రధానోపాధ్యాయుడు స్థానిక ఎమ్మార్సీ కేంద్రంలో మండల విద్యాధికారికి అప్పగిస్తారు.
- వీటిని అదే మండలానికి చెందిన ఇతర ఉపాధ్యాయులు మూల్యాంకనం చేస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా మండలానికి ఒక మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేస్తారు. సొంత పాఠశాలకు చెందిన జవాబు పత్రాలను దిద్దడానికి మార్కులు వేయడానికి ఆస్కారం ఉండదు.
- 3-5 రోజుల్లో మూల్యాంకనం పూర్తి చేయాలి. మార్కుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో ఒక్కో సమాధాన పత్రానికి రూ.2, ఉన్నత తరగతులకు రూ.3 చొప్పున పారితోషికం చెల్లిస్తారు.

22-ఏ జాబితా సవరించారు

కలెక్టరేట్‌లో జాబితాలను సరిచూస్తున్న రెవెన్యూ సిబ్బంది

భువనగిరి, న్యూస్‌టుడే: నిషేధిత భూముల 22ఏ జాబితా సవరణలపై అధికార యంత్రాంగం నడంబిగించింది. జిల్లాలో వ్యవసాయ, వ్యవసాయేతర నిషేధిత భూములు పెద్ద సంఖ్యలో ఉండటం.. ప్రజల ఇబ్బందులపై ఏకంగా జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేయడం.. మూడు రోజుల క్రితం సూర్యాపేటలో జరిగిన సమీక్షలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ముందస్తుగా వ్యవసాయేతర భూములను యథాస్థితి తెచ్చారు. ఇంటి నంబర్లు, యజమానుల పేర్లను ఆ జాబితా నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మునపటి మాదిరిగానే సర్వే నంబర్లు, విస్తీర్ణం ఉంటాయని రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.వెంకారెడ్డి ఈ విషయాన్ని స్పష్టం చేశారు.

● కలెక్టర్ ఆదేశాలతో భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి, 17 మండలాల తహసీల్దార్లు, సిబ్బంది కలెక్టరేట్‌కు చేరుకున్నారు. 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన ఇళ్లు, ప్లాట్ల వివరాలను పాత రికార్డులతో సరి చూశారు. అనంతరం గ్రామాల వారీగా జాబితాలో చేర్చిన ఇంటి నంబర్లు, పాట్లను, యజమానుల పేర్లను తొలగించారు.

● జిల్లా వ్యాప్తంగా 316 రెవెన్యూ గ్రామాలు ఉండగా 15 వరకు మినహాయించి అన్ని గ్రామాల్లో సవరణ పూర్తి చేశారు. సాంకేతిక కారణాలతో ఆగినవి రేపటి లోగా పూర్తి చేస్తామని ఒక అధికారి తెలిపారు. రేపటి నుంచి ఆన్‌లైన్లో వారి పేర్లు కనిపిస్తాయి. 22ఏ జాబితాలో చేర్చిన కారణంగా జిల్లా వ్యాప్తంగా సుమారు 39,648 గృహాలు, 28,549 ఎకరాల వ్యవసాయ భూములను 22ఏ జాబితాలో చేర్చిన విషయం విదితమే.

● భువనగిరి మండలంలో అత్యధికంగా 5వేలకు పైగా గృహాలు, అడ్డగూడూరు మండలంలో 1,041 గృహాలు ఉన్నాయి. ఈ జాబితాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అందజేశారు. అధికారుల నిర్ణయంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ITI SPOT ADMISSIONS
ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల ప్రకారం సం॥రమునకు రూ. 16,500/- మాత్రమే.
ఈ క్రింది కోర్సులలో ప్రవేశం గలదు. 1) ఫిట్టర్, 2) ఎలక్ట్రానిక్ మెకానిక్ 3) ఎలక్ట్రీషియన్ 4) ప్లంబర్ 5) డీజిల్ మెకానిక్. 6) డ్రాఫ్ట్‌మెన్ సివిల్.
నోట్: COPA (కంప్యూటర్) కోర్సు 1 సం॥కు రూ. 13,200/-లు మాత్రమే.
చివరి తేదీ: 05-09-2026
మార్కోని ITI, నల్లగొండ
శ్రీ శారద ITI, మిర్యాలగూడ
Cell: 98482 45036, 94900 97071, 94404 05112

(c) eenadu

ఆధునిక సాగుతో అధిక దిగుబడులు

మల్చింగ్ పద్ధతిలో మిరప సాగు

రైతేరాజు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: నీటి పొదుపు, కలుపు నియంత్రణ, నాణ్యమైన దిగుబడులు, రాయితీ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కేవీకే ఉద్యాన విభాగం శాస్త్రవేత్త సీహెచ్.నరేష్ సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నీటి కొరతను అధిగమించి సాగు ఖర్చులు తగ్గించుకోవడం, కూలీల కొరతను తట్టుకోవడం, కలుపు మొక్కలను నియంత్రించడం ముఖ్యం. వీటితో పాటు తెగుళ్ల ఉద్ధృతిని అరికట్టాల్సిన అవసరం ఉంది. ఉద్యాన పంటల్లో ప్లాస్టిక్ మల్చింగ్, షేడ్‌నెట్, నెట్ హౌస్, పాలిహౌస్ రక్షిత సాగు పద్ధతులను శాస్త్రీయంగా వినియోగిస్తే నీరు ఆదా చేయవచ్చు. కలుపు నియంత్రణ, పంట నాణ్యత, అధిక దిగుబడులు మెరుగు పర్చుకోవచ్చు.

షేడ్‌నెట్‌తో మొక్కలకు రక్షణ..

అధిక ఉష్ణోగ్రత, తీవ్రమైన సూర్యరశ్మి నుంచి మొక్కలను రక్షణకు షేడ్‌నెట్ నిర్మాణాలు ఉపయోగపడతాయి. కూరగాయల నారు, పూల మొక్కలు, అలంకరణ, నర్సరీ మొక్కలు, సున్నితమైన ఉద్యాన పంటల పెంపకానికి షేడ్‌నెట్ ఉపయోగకరంగా ఉంటుంది. అవసరాన్ని బట్టి నెట్‌లను ఎంపిక చేసుకోవాలి. అన్ని పంటలకు ఒకే రకమైన షేడ్‌నెట్ అనుకూలం కాదు. పంటకు అవసరమైన కాంతి, ఉష్ణోగ్రత, గాలి ప్రసరణ పరిగణలోకి తీసుకుని వినియోగించాలి.

ప్లాస్టిక్ మల్చింగ్‌తో నీటి పొదుపు ఇలా..

పంటల వరుసల మధ్య నేలను ప్లాస్టిక్ మల్చింగ్ షీట్‌ను కప్పడం వల్ల ద్రవ నేలలోని తేమ ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. సూర్యరశ్మి నేరుగా నేలపై పడకుండా ఉండటం వల్ల నీటి ఆవిరి తగ్గి మొక్కలకు అవసరమైన తేమ ఎక్కువ కాలం అందుబాటులో ఉంటుంది. మల్చింగ్ షీట్ నేలను కప్పి ఉంచడంతో కలుపు మొక్కల పెరుగుదల తగ్గుతుంది. దీంతో కూలీల ఖర్చు తగ్గించుకోవచ్చు. డ్రిప్ ఇరిగేషన్‌తో పాటు ఫెర్టిగేషన్ విధానాన్ని మల్చింగ్‌తో అనుసంధానం చేస్తే నీరు ఎరువులను మొక్కల వేర్ల ప్రాంతానికి అందించవచ్చు. ప్లాస్టిక్ మల్చింగ్ ఖర్చు పంట రకం, షీట్ మందం, వెడల్పు, పొలం అమరిక, స్థానిక కూలీల ధరలను బట్టి మారుతుంది. సాధారణంగా 30-50 మైక్రాన్ మల్చింగ్ షీట్‌ను ఉపయోగిస్తే ఎకరానికి రూ.12-22 వేల వరకు ఖర్చు అవుతుంది.

రాయితీతో రైతుకు లాభం..

ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షిత సాగు నిర్మాణాలకు రాయితీ అందిస్తున్నాయి. షేడ్‌నెట్, నెట్ హౌస్, పాలిహౌస్, లో టన్నెల్, వాక్-ఇన్ టన్నెల్, రక్షిత నర్సరీల నిర్మాణానికి రాయితీ పొందే అవకాశం ఉంది. రాయితీ శాతం యూనిట్ ఖర్చు, అర్హత, నిబంధనల ప్రకారం అందిస్తారు. నిర్మాణాలు అవసరమైన రైతులు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదిస్తే మార్గదర్శకాలు వివరిస్తారు. నర్సరీ మొక్కల సాంద్రత, డ్రిప్ ఇరిగేషన్, ఫెర్టిగేషన్, సమగ్ర పురుగు-తెగుళ్ల యాజమాన్యం పాటిస్తే లాభం ఉంటుంది.

సందేహం.. సమాధానం

? పత్తిలో వేరుకుళ్లు ఆశించి మొక్క ఎండిపోతుంది. నివారణ ఎలా. - పి.రమేష్‌రెడ్డి, మల్లారెడ్డిగూడెం

✔ వేరుకుళ్ల నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రా, ప్లాంటామైసిన్ 0.3 గ్రా, లీటరు నీటిలో కలిపిన ద్రావణాన్ని తెగులు సోకిన మొక్కల మొదట చుట్టూ పోయాలి.

? వరి పొలం వేసి 20 రోజులు అయింది. కాండం తొలిచే పురుగు నివారణకు చర్యలు ఏమిటి? - జి.లక్ష్మణ్, చిమిర్యాల

✔ కార్బోఫ్యూరాన్ 3 జి. గుళికలను 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జి గుళికలు 8 కిలోలు 25 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలి.

? బొప్పాయి సాగు చేయాలనుకుంటున్నాం. ఎప్పుడు నాటుకోవచ్చు. - డి.నాగేష్ మద్రిగూడ

✔ కొత్తగా బొప్పాయి నాటేందుకు ఆగస్టు, సెప్టెంబరు అనుకూలం. మొక్కల మధ్య 1.8 మీటర్ల దూరం ఉండేలా 40×40×40 సెం.మీ గుంతలు తీసి నాటుకోవాలి.

? బంతి మొక్కలు ఎప్పుడు నాటుకోవచ్చు. ఎన్ని రోజుల వయస్సు నారు నాటుకోవాలి. మొక్కలు ఎక్కడ దొరుకుతాయి. - పి.రవినాయక్, బీబీగూడెం

✔ బంతి మొక్కలు సెప్టెంబరు 15 వరకు నాటుకోవచ్చు. 25-30 రోజుల వయస్సు నారు నాటుకోవచ్చు. గడ్డిపల్లి కేవీకేలో నాణ్యమైన మొక్కలు లభ్యమవుతాయి.

కిరణ్ కుమార్

రైతులు వాట్సప్ ద్వారా అడిగిన సమస్యలకు గడ్డిపల్లి కేవీకే మృత్తికా విభాగం శాస్త్రవేత్త అరిగేలా కిరణ్‌కుమార్ సమాధానాలిస్తారు. -గరిడేపల్లి, న్యూస్‌టుడే:

78939 89055

ఎరువుల ఎంపిక విధానం ముఖ్యం

గరిడేపల్లి, న్యూస్‌టుడే: వివిధ రకాల పంటల్లో ఎరువుల ఎంపిక విధానం ముఖ్యమైందని కేవీకే మృత్తికా విభాగం శాస్త్రవేత్త అరిగేల కిరణ్ సూచించారు. నత్రజని, అమ్మోనియం సల్ఫేట్, కాల్షియం నైట్రేట్ వంటివి ఎరువుల రూపంలో లభ్యమవుతాయి. నత్రజని రసాయన పరంగా యూరియా రూపంలో ఉంటుంది. ఇసుక పాళ్లు ఎక్కువగా ఉన్న మాగాణి భూముల్లో మినహా మిగతా అన్ని నేలలకు పంటలకు దుక్కిలో, దమ్ములో పైపాటుగా వేసుకోవచ్చు. ఆమ్ల భూములకు సల్ఫైడ్ ప్రమాదం ఉన్న భూములకు అమ్మోనియం సల్ఫేట్ వాడకూడదు. క్షార గుణం నేలలకు, సున్నపు నేలలకు ఎప్పుడైనా వేసుకోవచ్చు. కాల్షియం అమ్మోనియం నైట్రేట్‌ను వరి చిరు పొట్ట దశలో వేయాలి. ఫాస్పేట్ ఎరువుల్లో సూపర్‌ఫాస్పేట్ ప్రధానమైంది. ఇది సాధారణంగా అన్ని పైర్లకు వేసుకోవాలి. కాంప్లెక్స్ ఎరువుల్లో అమ్మోనియం ఫాస్పేట్ అన్ని నేలలకు అన్ని పైర్లకు వాడవచ్చు. నైట్రోఫాస్పేట్లు మెట్ట ఆరుతడి పంటలకు ఎర్ర నేలలకు సాధారణ రసాయన స్థితిగల నేలలకు కొద్దిపాటి ఆమ్ల గుణం ఉన్న నేలలకు ఉపయోగపడుతుంది. నైట్రోఫాస్పేట్ వరికి వేసుకోవచ్చు.

పశువులు సకాలంలో ఎదకు రావడానికి..

త్రిపురారం, న్యూస్‌టుడే: పశువులు సకాలంలో ఎదకు రావడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండల పశువైద్యాధికారి నాగేంద్ర తెలియజేశారు. వర్షం, చలి కాలంలో సాధారణంగా ఆరోగ్యంగా ఉన్న పశువులు ఎదకు వస్తాయి. 70 శాతం పశువులకు సమస్యలు ఉంటాయి. మొదట నట్టల మందు తాగించాలి. ఆల్‌బెండజోల్, ఫెన్ బెండజోల్ మందు తాగించాలి. పచ్చి గడ్డి అందుబాటులో ఉండేలా చూడాలి. ఒక పశువుకు 30 కిలోల పచ్చి గడ్డి ఒక రోజులో ఇవ్వాలి. మినరల్ మిక్చర్, మందులు ఇవ్వాలి.

ఆర్టీసీలో సంఘం ఎన్నికలకు కసరత్తు

నల్గొండ ఆర్టీసీ ప్రాంగణంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

భానుపురి, కుడకుడరోడ్డు, న్యూస్‌టుడే: ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికల ప్రకటన ఈ నెలాఖరులోగా విడుదల కానుంది. కార్మికులు ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే నల్గొండ రీజియన్ పరిధిలోని ఆర్టీసీ ప్రధాన సంఘాలన్నీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాయి. ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోలలో టీఎంయూ, ఈయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్, ఎన్‌ఎంయూ, ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘాలున్నాయి. 2018లో ఈ ఎన్నికలు జరగాల్సి ఉండగా అప్పటి ప్రభుత్వం నిర్వహించలేదు.

డిపో	డ్రైవర్లు	కండక్టర్లు
దేవరకొండ	144	146
నల్గొండ	70	185
నార్కట్‌పల్లి	38	56
మిర్యాలగూడ	121	110
యాదగిరిగుట్ట	132	145
కోదాడ	114	98
సూర్యాపేట	55	208

గుర్తింపు ఇలా..: ఆర్టీసీలో అనేక కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ ఎన్నికల్లో గెలిచిన సంఘాలనే గుర్తింపు సంఘంగా పరిగణిస్తారు. ఈ గుర్తింపు సంఘాలు రీజియన్, రాష్ట్రస్థాయిలో ఉంటాయి. రెండింటికీ వేర్వేరు బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహిస్తారు. కార్మికుల వేతనాలు, బోనస్‌లు, డీఏలు, సర్వీస్ నిబంధనలు తదితర సమస్యలపై సంస్థ యాజమాన్యం ప్రభుత్వంతో చర్చలు జరిపే చట్టబద్ధమైన హక్కు ఈ సంఘానికే ఉంటుంది. కార్మికుల తరపున ఒప్పందాలు చేసుకోవడంలోనూ గుర్తింపు సంఘం కీలకంగా వ్యవహరిస్తోంది. రీజియన్‌లో పనిచేసే అధికారి స్థాయి మినహా మిగిలిన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులందరికీ ఓటు హక్కు ఉంటుంది.

త్వరగా ఎన్నికలు పూర్తి చేయాలి...

-బత్తుల సుధాకర్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజియన్ కార్యదర్శి, నల్గొండ

ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయాలంటే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతుంది. విలీన ప్రక్రియ త్వరగా పూర్తికావాలంటే ఆర్టీసీలో ఎన్నికలు త్వరగా జరగాలి. కార్మికులకు సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలి. పనిభారాలు తగ్గించాలి. సంస్థలో డిపో స్పేర్ విధానాన్ని ఎత్తివేయాలి.

మూడింటా లోటే

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు దాటుతుంది. ఆగస్టు నెల సైతం ముగిసిపోయింది. కానీ ఉమ్మడి జిల్లాలో సరైన వర్షాలు మాత్రం కురవలేదు. దీంతో భూగర్భ జలాలు తగ్గి అటు రైతులు, ఇటు సాధారణ ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 31 నాటికి కురవాల్సిన దాని కంటే 30శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది. దీంతో మూడు జిల్లాలో లోటు వర్షపాతం కలిగిన జిల్లాల జాబితాలోనే నిలిచాయి.

◆ జిల్లాల వారీగా సోమవారం వరకు కురవాల్సిన, కురిసిన వర్షపాతం వివరాలు (మిల్లీ మీటర్లలో)

జిల్లా	కురవాల్సింది	కురిసింది	తేడా(శాతంలో)
నల్గొండ	337.2	231.4	31.0
సూర్యాపేట	422.4	279.8	34.0
యాదాద్రి	375.9	245.5	35.0

✦ నల్గొండ జిల్లాలో మొత్తం 33 మండలాలు ఉండగా కేతేపల్లి మండలంలో 70 శాతం తక్కువ వర్షపాతం నమోదుతో అధిక లోటు వర్షపాతం కలిగిన మండలాల జాబితాలో నిలవగా 23 మండలాల్లో లోటు వర్షపాతం, 9 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. దామరచర్ల మండలంలో మాత్రమే 3శాతం అధిక వర్షపాతం నమోదు కాగా మిగిలిన అన్ని మండలాల్లో కురవాల్సిన దాని కంటే తక్కువ వర్షపాతం నమోదైంది.

✦ సూర్యాపేట జిల్లాలో మొత్తం 23 మండలాలు ఉండగా 60 శాతం తక్కువ వర్షపాతంతో పాలకీడు మండలంలో అధిక లోటు వర్షపాతం నమోదైంది. 18 మండలాల్లో లోటు వర్షపాతం, నాలుగు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. మఠంపల్లి మండలంలో 302.0 మిల్లీ మీటర్లకు అదే స్థాయిలో వర్షం కురవగా మిగిలిన అన్ని మండలాల్లో తక్కువ వర్షపాతమే నమోదైంది.

✦ యాదాద్రి జిల్లాలో 17 మండలాలు ఉండగా రెండు మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదు కాగా 15 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. అన్ని మండలాల్లోనూ కురవాల్సిన దాని కంటే తక్కువ వర్షపాతమే నమోదైంది.

హాయ్... పుస్తకాలు అందాయా..!

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వం అందించే సౌకర్యాలు వారికి అందుతున్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ప్రభుత్వ పథకాల్లో పారదర్శకతను తెలుసుకునే పనిలో రాష్ట్ర విద్యాశాఖ నిమగ్నమైంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, రాత పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారా లేదా అనే విషయాలను విద్యాశాఖ అధికారులు తెలుసుకుంటున్నారు.

వర్క్ బుక్స్ మినహా...

ఉమ్మడి జిల్లాలో 1733 ప్రభుత్వ పాఠశాలల్లో 1,89,350 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారందరి తల్లిదండ్రుల చరవాణులకు మీ సేవ తెలంగాణ ద్వారా సందేశాలను పంపించి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. జిల్లాలో వర్క్ బుక్స్ మినహా మిగిలిన పాఠ్య, రాత పుస్తకాలు విద్యార్థులకు చేరాయి. అక్కడక్కడ కొంత కొరతగా నిలిచినా అధికారులు అవసరమైన పుస్తకాలను తెప్పించే ప్రయత్నాల్లో ఉన్నారు. పాఠశాలల్లోని సమస్యలపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఎప్పటికప్పుడు అభిప్రాయాలు సేకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశంలో ఆదేశించడంతో ఈ ప్రక్రియను మొదట చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రశ్నావళి రూపంలో...

పాఠ్య, నోట్ పుస్తకాలు అందాయా అంటూ ప్రశ్నావళి రూపం లో విద్యార్థుల తల్లిదండ్రుల చరవాణులకు వాట్సాప్ సందేశాలను పంపిస్తున్నారు. సందేశంలో విద్యార్థుల పేర్లు, తరగతి, పాఠశాల గ్రామం, మండలం పేరు వంటి పూర్తి వివరాలతో సం దేశాలు చేరవేస్తున్నారు. అయితే కొన్ని మాత్రమే అందాయి, పూర్తిగా అందలేదనే ఆప్షన్ల ద్వారా తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలను స్వీకరిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కచ్చితమైన సమాధానాలు పంపితే భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యల గురించి విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయాలు తీసుకోనున్నారు.

వర్క్‌బుక్ రూపకల్పనలో మోత్కూరు ఉపాధ్యాయుడు

మేకల శశికుమార్

మోత్కూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్టీ) రూపొందించి, ప్రచురించిన 8వ తరగతి ఆంగ్ల వర్క్‌బుక్ రూపకల్పనలో మోత్కూరు ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు మేకల శశికుమార్‌కు ఆంగ్ల కంటెంట్ డెవలపర్‌గా అవకాశం లభించింది. విద్యార్థుల అభివృద్ధి, ఆత్మవిశ్వాసం, అంతర్గతశక్తి అనే అంశాలను ప్రోత్సహించేలా శశికుమార్ రచించిన 'డిస్కవర్ ద ట్రెజర్ విత్ ఇన్ యూ' కవితను 8వ తరగతి వర్క్‌బుక్‌లో ప్రచురించారు. ఈ కవిత విద్యార్థులు తమలో దాగిఉన్న శక్తి, సామర్థ్యాలను అన్వేషించుకోవాలని ప్రేరణనిస్తుంది. శశికుమార్ రచన వర్క్‌బుక్‌లో ప్రచురితమైన సందర్భాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను సోమవారం ఘనంగా సన్మానించారు.

పురుగుమందు తాగి మహిళ ఆత్మహత్య

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మనస్తాపానికి గురై పురుగు మందు తాగి మహిళ బలవన్మరణానికి పాల్పడిన ఘటన మిర్యాలగూడ మండల పరిధిలో చోటు చేసుకుంది. గ్రామీణ ఎస్సై లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వెంకటాద్రిపాలెం గ్రామం దుర్గానగర్‌కు చెందిన కొమెర సైదమ్మ (39) పట్టణంలోని ఓ హోటల్‌లో పని చేస్తూ మద్యానికి బానిసైంది. దీంతో భర్త గణేష్ ఎదుట తాగొద్దని వారించడంతో మనస్తాపానికి గురై ఆదివారం సాయంత్రం పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు తక్షణమే ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా అదే రోజు రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యులు సోమవారం అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మరొకరు..

నిడమనూరు, న్యూస్‌టుడే: గుర్తుతెలియని మాత్రలు మింగి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...నిడమనూరుకు చెందిన గోగుల లింగయ్య కుమార్తె సుజాత(37)ను నార్కెట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన వరికుప్పల కృష్ణకు ఇచ్చి వివాహం చేశారు. కాగా వారి కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై ఆమె విరక్తి చెందింది. గత శుక్రవారం ఎల్లారెడ్డిగూడెం నుంచి నిడమనూరులోని ఆమె తల్లిదండ్రుల ఇంటికి వచ్చింది. వస్తూ మార్గమధ్యలో గుర్తు తెలియని మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించినట్లు సుజాత తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు వెంటనే హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. ఈ ఘటనపై ఆమె తండ్రి లింగయ్య సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తమిళనాడు సీఎంని కలిసిన ఎంపీ చామల

తమిళనాడు సీఎం విజయ్‌తో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం చెన్నైలో జరిగిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ స్టడీ టూర్‌లో చామల పాల్గొన్నారు. అనంతరం సీఎం విజయ్‌ని కలిసి.. తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల మధ్య పరస్పర సహకార అంశాలపై చర్చించారు.

పెండింగ్ ప్రాజెక్టులపై అసెంబ్లీలో చర్చించాలి

ఐక్యత చాటుతున్న అనురాధ, నరసింహారావు, సీతారాములు, జాన్‌వెస్లీ, జహంగీర్, వీరయ్య తదితరులు..

నల్లకుంట, న్యూస్‌టుడే: యాదాద్రి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులపై అసెంబ్లీలో చర్చించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేసి ప్రాజెక్టులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. సీపీఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం చేపట్టిన పాదయాత్ర ముగింపు సందర్భంగా సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రాణహిత-చేవెళ్ల రీ డిజైన్ కారణంగా తిమ్మాపూర్, చౌక్లానాయక్ తండా, లప్పనాయక్ తండాలు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అందుకోసం నష్టపరిహారం రూ.420 కోట్లు ఇవ్వాల్సి ఉండగా.. కేవలం రూ.206 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకొందన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, చెరుపల్లి సీతారాములు, జిల్లా కార్యదర్శి జహంగీర్, డీజీ.నరసింహారావు, కె.నరసింహ, అనురాధ, ఆర్.వెంకట్‌రాములు, సైల్కాబ్‌బాబు, పైళ్ల ఆశయ్య, వెంకటేశ్, బాలరాజు, మల్లేశం, పాండు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

'కాంగ్రెస్ మోసపూరిత హామీలపై నిరసనలు'

మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, విజయసింహారెడ్డి, భూపాల్‌రెడ్డి

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మోసపూరిత హామీలపై ఈ నెల 1 నుంచి 8 వరకు రాష్ట్ర వ్యాప్తంగా భారాస నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తెలిపారు. మిర్యాలగూడలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసగించిందని అన్నారు. మిర్యాలగూడ పట్టణంలో ఈనెల 3న చేపట్టనున్న రైతు సదస్సుకు భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని చెప్పారు. పెద్దఎత్తున రైతులు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, నాయకులు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, నారాయణరెడ్డి, యడవల్లి శ్రీనివాసరెడ్డి, నాగార్జునచారి, చిట్టిబాబు నాయక్, బాలాజీ నాయక్, వీరకోటిరెడ్డి, సేవ్యా, చౌగాని భిక్షం తదితరులు పాల్గొన్నారు.

బాలికకు గర్భం.. యువకుడిపై పోక్సో కేసు నమోదు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రం కోదాడ పట్టణానికి చెందిన పదో తరగతి బాలిక గర్భిణి అయిన ఘటనపై విజయవాడ గవర్నర్‌పేట పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బాలికను వైద్యం నిమిత్తం కుటుంబ సభ్యులు సోమవారం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ఆమె వయస్సు 15 సంవత్సరాలు, ఐదో నెల గర్భిణి కావడంతో ఆసుపత్రి సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆసుపత్రికి చేరుకుని బాలిక కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఆమెకు పరిచయమైన యువకుడే దీనికి కారణమని పోలీసులు గుర్తించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు చెప్పలేకపోవడంతో.. వారిచ్చిన సమాచారం మేరకు పోక్సో సెక్షన్ కింద జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోదాడ బదిలీ చేశారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

గుర్రంపోడు, న్యూస్‌టుడే: ఉరేసుకొని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. గుర్రంపోడు మండలం పిట్టలగూడెం గ్రామానికి చెందిన భైరి యాదగిరి(43) ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా సోమవారం ఉదయం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వెంకన్న, గ్రామస్థుల కథనం ప్రకారం.. యాదగిరి నిత్యం మద్యం మత్తులో ఉంటూ భార్యతో వాగ్వాదం పెట్టుకోవడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం రాత్రి ఇంట్లో ఒక్కడే ఉండటంతో మనస్తాపానికి గురై ఇంట్లోనే బలవన్మరణానికి పాల్పడినట్లు గుర్తించారు. యాదగిరి సోదరుడు కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అత్యాచారం ఘటనలో పదేళ్ల జైలు

నల్గొండ లీగల్, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ముద్దాయి మూడవత్ మల్లేశ్‌కు పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ నల్గొండ పోక్సో ప్రత్యేక న్యాయస్థాన న్యాయమూర్తి విశ్వనాథ్‌కులకర్ణి దిలీప్‌రావ్ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. డిండి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మూడవత్ మల్లేశ్ ఆటోలో పరిచయమైన మండలానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి లోబరచుకున్నాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరిస్తూ బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. అతడి బెదిరింపులు భరించలేక బాలిక 2020 సెప్టెంబరు 8న పురుగుమందు తాగింది. ఆసుపత్రిలో చికిత్స అనంతరం కోలుకుంది. వైద్యుల పరీక్షలో బాలిక మూడు నెలల గర్భిణిగా తేలింది. నిందితుడు తనకు సంబంధం లేదని చెప్పడంతో డిండి పోలీసులు మల్లేశ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేశారు. పోలీసులు దర్యాప్తు ముగించి ఛార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. న్యాయస్థాన విచారణలో నేరనిర్ధారణ కావడంతో మల్లేశ్‌కు పదేళ్ల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానాను న్యాయమూర్తి విధించారు. చట్ట ప్రకారం ఆ బాలికకు రూ.ఏడులక్షల నష్టపరిహారాన్నిప్రభుత్వం ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ప్రాసిక్యూషన్ తరపున ప్రత్యేక పీపీ రంజిత్‌కుమార్ వాదించారు.

167 రహదారి ఎన్‌హెచ్‌ఏఐకి బదలాయింపు

కోదాడ నుంచి జడ్చర్ల వెళ్లే 167 రహదారి

గరిడేపల్లి, న్యూస్‌టుడే: కోదాడ నుంచి మిర్యాలగూడ, హాలియా మీదుగా వెళ్లే జడ్చర్ల రహదారి(167)ని జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థకు బదలాయిస్తున్నారు. ఈ మేరకు ఈ నెల మొదటి వారంలో గెజిట్ విడుదల చేశారు. ఇంతకాలం రోడ్డు విస్తరణ పనులు చేయించిన జాతీయ రహదారుల శాఖ పర్యవేక్షణ చేసేది. దాంతో పాటు గుత్తేదారుకు ఇచ్చిన ఐదేళ్ల నిర్వహణ గడువు ముగియడంతో ఈ మేరకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. కొద్ది రోజుల్లో సంబంధిత ఉన్నతాధికారుల సమక్షంలో అధికారికంగా నిర్వహణ బాధ్యతలను స్వీకరించనుంది. కోదాడ నుంచి జడ్చర్ల వరకు 234 కి.మీ రహదారిని 2017-18లో జాతీయ రహదారుల శాఖ విస్తరించింది.

గెజిట్ విడుదల...: ఇప్పటి వరకు కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో గుత్తేదారు పని చేశారు. రహదారిపై గ్రామాల పరిధిలోని సెంట్రల్ లైటింగ్, రోడ్ల నిర్వహణ బాధ్యతలను వారే నిర్వహించేవారు. నాలుగేళ్ల నిర్వహణ జూన్‌తో పూర్తి కావడంతో బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. దాంతో జులైలో అధికారులు రహదారిని పరిశీలించి అనంతరం ఆగస్టులో జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థకు బదలాయిస్తూ గెజిట్ విడుదల చేశారు. అంటే వారు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి వీధి దీపాల బిల్లు, రోడ్డు నిర్వహణ చేపట్టనున్నారు. స్వల్పకాలిక నిర్వహణకు మరోసారి టెండర్ వేసి నాలుగు వరుసల రహదారి వేసే వరకు పొడిగిస్తూ నిర్వహణ చేపడతారు. గతంలో విస్తరణ సమయంలో 10 మీటర్ల తారు రోడ్డు వేశారు. గ్రామాల పరిధిలో పలుచోట్ల నాలుగు వరుసల రహదారి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. రోడ్డును 100 అడుగుల మేర తీసుకున్నారు.

నాలుగు వరుసలకు ప్రతిపాదనలు...

ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో ప్రస్తుతం ఉన్న 10 మీటర్ల రహదారిని నాలుగైదు ఏళ్లలో నాలుగు వరుసలుగా విస్తరించనున్నట్లు అధికారులు తెలిపారు. 167 జాతీయ రహదారి పూర్తి దూరం సుమారు 483 కి.మీ. ఇందులో తెలంగాణలో 300 కి.మీ ఉండగా అందులో 2018లో విస్తరించిన జడ్చర్ల నుంచి కోదాడ వరకు 234 కి.మీ ఉంటుంది. ఈ మార్గంలో ఇప్పటికే గుడబెల్లూరు నుంచి మహబూబ్‌నగర్ వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి టెం డర్ ప్రక్రియ పూర్తయి భూమి సేకరణ జరుగుతుంది. తర్వాత మహబూబ్‌నగర్ నుంచి జడ్చర్లకు అనంతరం జడ్చర్ల నుంచి కోదాడకు మరో నాలుగైదు ఏళ్లలో నాలుగు వరుసల రహదారి వేసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ రహదారిపై వాహనాల రద్దీ పెరిగినందున త్వరలోనే నాలుగు వరుసల రోడ్డుకు నిధులు మం జూరు అవుతాయని ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.

EENADU e Classifieds

TO LET

సాయిభవాని జనరిక్&ఫార్మా మెడికల్&జనరల్ స్టోర్స్, రామగిరి, నల్లగొండ తక్షణం అద్దెకు/లీజుకు ఇవ్వబడును. (2-3 లక్షల స్టాక్ కలదు) మరియు 1-2 సంవత్సరాల అనుభవం గల ఫుల్/పార్ట్‌టైం సిబ్బంది కావలెను. 99859 24629.

DRIVERS

సూర్యాపేటలోఉండి కారు డ్రైవింగ్ అనుభవం ఉన్న డ్రైవర్ కావలెను. మంచిజీతం షెల్టర్ ఇవ్వబడును. సెల్:6300155438, 6300955438.

JOBS

ప్రముఖ సోలార్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. నెలకు 20వేలు+ ఇన్సెంటివ్స్. మీ మండలాలలో, పట్టణాలలో పనిచేయాలి. ✆ 9866570239, 9347319131

నల్లగొండపట్టణంలో Climatop బ్రాండ్ క్లీనింగ్ ప్రొడక్ట్స్‌నందు మార్కెటింగ్‌పర్సన్,ఆఫీసులో సేల్స్‌పర్సన్ కావలెను. Age:19-26. 9347745072.

నార్కట్‌పల్లి వద్దగల పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మేనేజర్ & బాయ్స్ కావలెను. మంచి జీతం ఇవ్వబడును. సంప్ర|| 99590 66588, 98854 12195.

సుధా బ్యాంక్ తిరుమలగిరి పట్టణ బ్రాంచ్, సూర్యాపేట జిల్లాలో క్లర్క్ కమ్ క్యాషియర్‌గా పనిచేయుటకు ఏదైనా డిగ్రీ మరియు కంప్యూటర్ నైపుణ్యం కలిగిన యువతి, యువకులు కావలెను. వెంటనే md@sudha.bank.inకు మీ బయోడేటా పంపగలరు. సెల్: 91333 72508.

Book Your 5 Lines Classified Advertisement for B/W 355/- COLOUR 440/- (GST 5% Extra) Contact 8008116681

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్‌-లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 80081 16681

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 99080 16689

(c) eenadu

పదోన్నతి పొందిన జడ్జికి సన్మానం

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొంది భువనగిరి అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన జడ్జి షేక్ అఫీక్‌కు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలియజేశారు. భువనగిరి బార్ అసోసియేషన్ హాల్‌లో అధ్యక్షుడు నిసంగి విద్యాసాగర్ అధ్యక్షతన సోమవారం పదోన్నతి పొందిన జడ్జిని శాలువతో సన్మానించారు. భువనగిరి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న ఆయనకు హైకోర్టు పదోన్నతి కల్పించి జడ్జిగా పోస్టింగ్ ఇచ్చింది. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాదగిరి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జడ్జి షేక్ అఫీక్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నిసంగి విద్యాసాగర్, న్యాయవాదులు

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

అడ్డగూడూరు, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖకు అధిక నిధులు కేటాయిస్తూ ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం ధర్మారంలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.కోటితో నిర్మిస్తున్న పాఠశాల భవనాన్ని పరిశీలించి, సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ అధికారులున్నారు.

ధర్మారంలో నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనాన్ని పరిశీలించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

ఎంపికైన అందరికీ ఇళ్లు ఇవ్వాలి: భారాస

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: ఎంపికైనందరికీ రెండు పడకగదుల ఇళ్లు ఇవ్వాలని భారాస పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. తమ హయాంలో 90 శాతం పనులు పూర్తిచేసిన ఇళ్ల వద్ద సోమవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. 444 ఇళ్లు నిర్మించి ఉండగా 120 మందికి ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందో జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. క్షీరాభిషేకం చేస్తున్న భారాస, కాంగ్రెస్ నాయకుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, నాయకులు మహ్మద్ ..., కేశపట్నం రమేశ్, ఖాజా అజీముద్దీన్, ఎన్నాల్ చౌదరి, పద్మ, భగత్, పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా యాదగిరి

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా చొగాని యాదగిరి ఎన్నికయ్యారు. ఈయన ఆలేరు పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పోలీస్ అధికారుల సంఘం ఎన్నికల ప్రక్రియలో భాగంగా మూడు కేటగిరీలకు మూడు దఫాలుగా ఎన్నికలు నిర్వహించారు. కానిస్టేబుల్/హెడ్ కానిస్టేబుల్, ఏఎస్సై/ఎస్సై, ఇన్‌స్పెక్టర్ కేటగిరీ స్థానాల్లో మొత్తం 34 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యవర్గానికి ఎస్పీ అక్షాంశ్‌యాదవ్ అధికారికంగా నియామక పత్రాలు అందజేశారు.

వీబీ జీ రామ్‌జీ.. గ్రామ సభలు షురూ!

రాజపేట, ఆలేరు, న్యూస్‌టుడే :

> వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వీబీ జీ రామ్‌జీ చట్టం-2025 అమలు దిశగా గ్రామీణాభివృద్ధి శాఖ అడుగులు వేస్తోంది. జులై ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చిన ఈ పథకం అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి 125 రోజుల పనిదినాలు కల్పించేందుకు 'వికసిత్ పంచాయతీ ప్రణాళిక' పేరిట ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనులను గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహించాలని జిల్లా పాలనాధికారి అనురాగ్ జయంతి, డీఆర్‌డీవో నాగిరెడ్డిలు ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లా సమాచారం..	
జాబ్‌కార్డులు	2,61,745
కుంటుంబాలు	14,73,487
క్రియాశీలక కూలీలు	1,27,639

బీబీనగర్ మండలం రాయరావు పేటలో వీబీ జీ రామ్‌జీ గ్రామసభలో పాల్గొన్న అధికారులు, స్థానికులు

రెండు విడతలుగా...

ప్రణాళికల తయారీకి రెండు విడతల్లో గ్రామసభలు నిర్వహించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. సెప్టెంబరు 8వ తేదీ వరకు మొదటి విడత సభలు నిర్వహిస్తారు. వీటిలో వీబీ జీ రామ్‌జీ చట్టం ఉద్దేశాలు, అవగాహన, గ్రామానికి సంబంధించిన ప్రగతి నివేదిక, గత ఏడాది చేసిన పనులు, ఖర్చుల వివరాలు వంటి వాటిపై చర్చిస్తారు. 12 నుంచి 15వ తేదీ వరకు రెండో విడత సభలు నిర్వహించి లబ్ధిదారుల వివరాలు, అంచనా వ్యయం వంటివి వివరిస్తారు. ఆమోదం అనంతరం మండల స్థాయిలో ఏర్పాటు చేసిన మూడు బృందాల పరిశీలనకు పంపనున్నారు.

318 పనులకు అవకాశం

జిల్లాకు కేటాయించిన 318 పనుల్లో నీటి భద్రత విభాగంలో 107, గ్రామీణ మౌలిక వసతులకు 90 పనులు, జీవనోపాధి వసతులకు 86, విపత్తుల నివారణకు 35 పనులు చేపట్టనున్నారు. ఈ బృందాలు గ్రామీణ స్థాయిలో క్షేత్ర పర్యటన చేసి, ప్రజలతో చర్చించి గ్రామ వనరుల ఆధారంగా వాటిని అంచనా వేయాలి. జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలని సదరు ఉత్తర్వులో పేర్కొన్నారు.

జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం

–నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

నూతన చట్టానికి లోబడి జల సంరక్షణ పనులకు ఈ ఆర్థిక సంవత్సరంలో అత్యంత ప్రాధాన్యం కల్పించనున్నాం. గ్రామసభల్లో స్థానిక అవసరాన్ని బట్టి ఎన్ని పనులకైనా ఆమోదం లభించనున్నందున ఈ అవకాశాన్ని ప్రజా ప్రతినిధులు, స్థానికులు సద్వినియోగ పరచుకోవాలి.

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై నిరసనలు

తుర్కపల్లి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ అసమర్థ పాలనపై వారం రోజుల పాటు భారాస ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాలు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల అసమర్థ పాలనకు నిరసనగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు సీతరాజు, బబ్బూరి రవీంద్రనాథ్‌గౌడ్, గిద్దె కరుణాకర్, కల్లూరి నర్సింహారెడ్డి, భాస్కర్‌నాయక్, రమేశ్‌నాయక్, రవీందర్‌నాయక్, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, కనకయ్య, హరినాయక్ పాల్గొన్నారు.

తుర్కపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించండి

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 74 అర్జీలను స్వీకరించి జిల్లా స్థాయి అధికారులతో ఆయన మాట్లాడారు. రెవెన్యూ శాఖ 47, సర్వే ల్యాండ్స్ 5, ఉపాధి కల్పన 3, గ్రామీణాభివృద్ధి 2, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ, ఎంపీడీవోలు, చేనేత జౌళి తదితర శాఖల నుంచి దరఖాస్తులు అందినట్లు అధికారులు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో జయమ్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కృతిక, సాత్విక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం: కుంభం

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సింగన్నగూడెంలోని రెండు పడకగదుల సామూహిక గృహప్రవేశాలను పురస్కరించుకుని సోమవారం ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్లలో భారాస ప్రభుత్వం పేదలకు ఒక్క ఇల్లు మంజూరు చేయలేదని ఆరోపించారు. పుర అధ్యక్షురాలు తంగెళ్లపల్లి శ్రీవాణి, ఉపాధ్యక్షురాలు పోతంశెట్టి మంజుల, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అవేస్ ఉర్ రహ్మాన్ చిస్తీ, హౌసింగ్ పీడీ చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ బొంతల నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

లబ్ధిదారు రజియా ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంభం అనిల్ కుమార్‌రెడ్డి

❒ లబ్ధిదారులైన వారు ఇళ్లు ఇవ్వాలని నినాదాలు చేస్తుండటంతో వారిని సముదాయించేందుకు అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు వేదిక దిగి కిందికి వచ్చారు. నచ్చజెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ వారు వినకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తూ వీరిని బయటికి తీసుకెళ్లాలని పోలీసులను ఆదేశించారు. లబ్ధిదారుల పక్షాన భారాస నాయకులు అదనపు కలెక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. ప్రతిపక్ష నాయకులు, లబ్ధిదారుల ఒత్తిడిని తట్టుకోలేక ఆయన సభాస్థలి నుంచి నిష్క్రమించారు.

చెక్కులు పంపిణీ.. భువనగిరి పట్టణం : క్యాంపు కార్యాలయంలో బీఎన్ తిమ్మాపురం బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి పంపిణీ చేశారు.

శాస్త్రీయ ఆలోచన విధానం పెంపొందించాలి

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: ప్రయోగాత్మక విద్య ద్వారా విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచన విధానం పెంపొందించాలని డీఈవో బి.భిక్షపతి ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం యాదగిరిగుట్ట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బయోసైన్స్‌పై ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని, బయోసైన్స్‌లోని అంశాలను సులభంగా అర్థమయ్యేలా పరికరాల ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో శరత్ యామిని, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఈవో బి.భిక్షపతి

చెరువు కట్టే.. మందుబాబుల అడ్డా

ఆలేరు మండలం కొలనుపాక పిన్నచెరువు కట్ట మందుబాబులకు అడ్డాగా మారింది. నిత్యం యువకులు చెరువు కట్ట, బతుకమ్మఘాట్ వద్ద రాత్రివేళ మద్యం సేవిస్తున్నారు. వెలుతురు లేకుండా ఉండేందుకు ఘాట్‌వద్ద ఉన్న విద్యుత్తు దీపాలను సైతం పగులగొట్టారు. రాత్రి కాగానే యువకులు గుంపులుగా చేరుతూ అర్ధరాత్రి దాటేంత వరకు మద్యం సేవిస్తున్నారు.

చెరువు సోమేశ్వరాలయానికి ఆనుకునే ఉండటంతో ఆలయానికి వచ్చే భక్తులు, పర్యాటకులు చెరువును చూసేందుకు వెళుతున్న క్రమంలో పగిలిన మద్యం సీసాల ముక్కలు కాళ్లకు గుచ్చుకుని గాయాల బారిన పడుతున్నారు. పోలీసులు నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు. ఆలేరు, న్యూస్‌టుడే:

బీటలు వారుతున్న పొలాలు

తుర్కపల్లి మండలంలో వర్షాభావ పరిస్థితులతో చెరువులు, కుంటలు వెలవెలబోతున్నాయి. బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. వానా కాలంలో వరి పంట సాధారణ విస్తీర్ణం 15 వేల హెక్టార్లు ఉండగా తొమ్మిది వేల హెక్టార్లు మాత్రమే సాగు చేశారు. వాన జాడలు కనిపించకపోవడంతో పంట చేతికందకుండా పోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

-న్యూస్‌టుడే, తుర్కపల్లి

అసంపూర్తి పనులతో ఇబ్బందులు

భువనగిరి పట్టణం హన్మాపురం రైల్వే వంతెనపై అసంపూర్తి పనులతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెన జాయింట్ల వద్ద ఉన్న ఇనుప పట్టీలు ఊడిపోయి గుంతలు ఏర్పడటంతో మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. పనులు నెలల తరబడి కొనసాగించి అసంపూర్తిగా వదిలేయడంతో పట్టీల వద్ద గండ్లు పడ్డాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అసంపూర్తి పనులు పూర్తి చేసి వాహనదారులకు ప్రయోజనం చేకూర్చాల్సిన అవసరం ఉంది. –న్యూస్‌టుడే, భువనగిరి పట్టణం

పట్టించుకోని వైనం.. కదలని ప్రవాహం

రామన్నపేటలో రూ.5లక్షలు వ్యయంతో నిర్మించిన డ్రైనేజీ (మురుగు కాల్వ) లక్ష్యానికి దూరంగా నిలిచి ఆనవాళ్లు కోల్పోతుంది. పట్టణంలోని బీసీ కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్య పరిష్కారం లక్ష్యంగా ఈ కాల్వను స్థానిక వెంకట్రామ చెరువు అలుగు వరకు ఐదేళ్ల క్రితం నిర్మించారు. అనంతరం కాల్వ నిర్వహణను విస్మరించారు. పూర్తిగా చెత్త, మట్టితో కంప చెట్లతో నిండిపోయింది. నీటి ప్రవాహం ముందుకు సాగటం లేదు. కాల్వకు ఇరు వైపులా నిర్మించిన లైనింగ్ పలు చోట్ల పెచ్చులూడుతోంది. పూర్తి లైనింగ్ పై భాగం మట్టితో పేరుకుపోయింది. సమీపానికి వెళ్లి చూస్తే కానీ ఇది డ్రైనేజీ అనే విషయం తెలియని పరిస్థితి. – న్యూస్‌టుడే, రామన్నపేట

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: మాదకద్రవ్యాల వినియోగంతో కుటుంబ భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటుందని యాదగిరిగుట్ట సీఐ భాస్కర్ సూచించారు. సోమవారం పట్టణంలోని పాత గుండ్లపల్లిలో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్నేహితుల ఒత్తిడితోనైనా మాదకద్రవ్యాల జోలికి వెళ్లవద్దని సూచించారు. ఎవరైనా వ్యసనానికి గురైతే కుటుంబ సభ్యులు, వైద్యులు, పునరావాస నిపుణుల సహాయం పొందాలని సూచించారు. యువత భవిష్యత్తును కాపాడేందుకు మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సైలు యాదయ్య, ఇంద్రారెడ్డి, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సీఐ భాస్కర్ తదితరులు

అర్చకుడు మృతి

చంద్రశేఖర్

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరు మండలం కొలనుపాక సోమేశ్వరాలయం అర్చకుల్లో ఒకరైన జీఎం.చంద్రశేఖర్(42) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. రెండున్నర దశాబ్దాలుగా సోమేశ్వరాలయంలో వంశపారంపర్యంగా అర్చకుడిగా పనిచేస్తున్నారు. కొంత కాలం కిందట అనారోగ్యానికి గురయ్యాడు. ఇతనికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. సోమవారం గ్రామంలో అంత్యక్రియలు జరిగాయి. ప్రభుత్వవిప్ బీర్ల అయిలయ్య, కర్ణాటక వీరశైవ సమాజం ముఖ్యులు చంద్రశేఖర్ నివాళులు అర్పించారు. అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

కారులోని వస్తువుల చోరీ

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: క్షేత్ర సందర్శనకు వచ్చిన భక్తుల వాహనంలోని వెండి ప్లేట్, మొబైల్ ఫోన్లు చోరీకి గురైన ఘటన యాదగిరిగుట్టలో సోమవారం జరిగింది. ఆగంతకుడు కారు వెనుక భాగంలోని అద్దాలు పగులగొట్టి అందులోని వెండి ప్లేట్, రెండు మొబైల్ ఫోన్లు తస్కరించారు. ఈ ఘటన శివాలయం సమీపాన జరిగింది. హైదరాబాద్ నారాయణగూడకు చెందిన బాధితులు ఆలయ ఈవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

విద్యుదాఘాతంతో కోడె మృత్యువాత

వలిగొండ, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో కోడె మృతి చెందిన ఘటన మండలంలోని కంచనపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొలిచెలిమి జగన్ వ్యవసాయ క్షేత్రంలో కోడె మేత మేసుకుంటూ విద్యుత్తు వైర్లకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

భువనగిరి, న్యూస్‌టుడే: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యంగా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సోమవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రోడ్డు విస్తరణ, ఫ్లైఓవర్ నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారుల వెంట భారీ వాహనాలు, ట్రక్కులు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్డుపై ఆక్రమణలు జరగకుండా చూడాలని సూచించారు. రోడ్డుపై పశువులు రాకుండా మున్సిపల్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ట్రాఫిక్ డీఎస్పీ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా రోడ్లు, భవనాల అధికారి సరిత, జిల్లా రవాణా అధికారి నరేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి: జిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సోమవారం మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. కళాశాల విద్యార్థులు, ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ తుక్యానాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దుకు డిమాండ్

భువనగిరి, న్యూస్‌టుడే: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 1వ తేదీని విద్రోహ దినంగా ప్రకటించిన ఉద్యోగ జేఏసీ ఆదేశాలను అమలు చేయాలని గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి గుర్రాల బాలకృష్ణ సోమవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. సీపీఎస్‌తో ఉద్యోగుల ఉద్యోగ విరమణ అనంతరం భవిష్యత్తు అంధకారం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వృద్ధులను వేధించేవారిపై చర్యలు తీసుకోవాలని వినతి

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: వయోవృద్ధులను వేధించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ అక్షాంశ్‌యాదవ్‌ను తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యెర్రగుంట వెంకటేశ్వర్లు కోరారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఎస్పీని కలిశారు. వయోవృద్ధులపై వేధింపులు నివారించేందుకు ప్రతి పోలీస్ స్టేషన్‌లో స్వచ్ఛంద కమిటీలను ఏర్పాటు చేయాలని, డీజీపీ ఆదేశాల మేరకు కమిటీ సభ్యుల జాబితాను ఎస్పీకి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సాదినేని దశరథ, కరిపే నర్సింగ్‌రావు, కూచిబట్ల సత్యనారాయణరెడ్డి, కోశాధికారి కోంగరి రవీందర్, ప్రధాన కార్యదర్శి దర్గాయి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

భువనగిరి: ఆర్టీసీ బస్సుల్లో వయోవృద్ధులకు 50 శాతం రాయితీ ప్రకటించాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యెర్రగుంట వెంకటేశం సోమవారం ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో ఉచిత దర్శన సదుపాయం కల్పించాలని పేర్కొన్నారు.

భారాస మండలస్థాయి సమావేశం

రాజపేట, న్యూస్‌టుడే : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా కేటీఆర్ పిలుపు మేరకు భారాస శ్రేణులు మండలంలో చేపడుతున్న నిరసన కార్యక్రమాలకు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేశ్ కోరారు. సోమవారం స్థానికంగా పార్టీ సమావేశంలో మాట్లాడుతూ.. తేదీల వారీగా చేపట్టే కార్యక్రమాలకు హాజరు కావాలన్నారు.

ఎరుకల హక్కుల కోసం పోరాటం

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: ఎరుకల సామాజికవర్గం ప్రజల ఆత్మగౌరవం, హక్కుల సాధనకు ఉద్యమాలు కొనసాగించాలని ఏఐవైహెచ్‌పీఎస్ తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మానుపాటి కృష్ణ పిలుపునిచ్చారు. ఎరుకల తెగ కుర్రు ప్రజల ఆత్మగౌరవ పోరాట విమోచన జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం యాదగిరిగుట్టలో నిర్వహించారు. బ్రిటీష్ పాలనలో ఎరుకల తెగ ప్రజలపై అమలు చేసిన క్రిమినల్ ట్రైబ్స్ చట్టానికి వ్యతిరేకంగా ఎరుకల ప్రజలు సాగించిన పోరాటం చారిత్రాత్మకమన్నారు. 1952 ఆగస్టు 31న ఆ చట్టం రద్దు కావడం ఎరుకల ప్రజల పోరాట విజయానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ప్రభుత్వం ఏకలవ్య కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేసి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.పరశురాం, నాయకులు అంజి, కూతాడి అఖిల్, సముద్రం, యాకయ్య, డి.రవికుమార్, దేవర యాదగిరి, పెద్దరాజు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కృష్ణ తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
భువనగిరి పట్టణం: 8008574380, భువనగిరి గ్రామీణం: 8008550364,
ఆలేరు: 8008574375, యాదగిరిగుట్ట పట్టణం: 8008574414,
మోత్కూరు: 8008574419, చౌటుప్పల్: 8008574968

హౌసింగ్ డిప్యూటీ ఏఈ ఉద్యోగ విరమణ

భువనగిరి, న్యూస్‌టుడే: జిల్లా హౌసింగ్ డిప్యూటీ ఏఈ గవ్వ రవీందర్‌రెడ్డి సోమవారం ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా స్థానిక వివేరా హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులు ఆయన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు, కౌన్సిలర్లు చల్లగురుగుల రఘుబాబు, నరసింహ పాల్గొన్నారు.

పోలీస్‌గా సేవలు అందించడం గర్వకారణం

భువనగిరి నేరవిభాగం: పోలీస్‌శాఖలో ఉద్యోగ బాధ్యతలు సమర్థంగా నిర్వహించి ప్రజాసేవ అందించడం గర్వకారణమని ఎస్పీ అక్షాంశ్‌యాదవ్ అన్నారు. సోమవారం ఉద్యోగ విరమణ పొందిన భువనగిరి పట్టణ ఎస్సై రామకృష్ణారెడ్డి, ఏఎస్సై వీరేశంను ఎస్పీ క్యాంపు కార్యాలయంలో వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

స్వర్ణగిరిలో శ్రీనివాస కల్యాణం

భువనగిరి, న్యూస్‌టుడే: శ్రావణ సోమవారం పురస్కరించుకొని స్వర్ణగిరి క్షేత్రంలో పద్మావతి అమ్మవారికి నవ కలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు. మహాలక్ష్మీ హవనం జరిపారు. అనంతరం వైభవోత్సవ మండపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి నిత్యకల్యాణోత్సవం కనులపండువగా జరిపారు. సాయంత్రం తిరువీధి సేవోత్సవం ఆలయ మాడవీధుల్లో వైభవంగా చేపట్టారు. రాత్రి పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన జరిపారు.


ఆలయ మాడవీధిలో సేవోత్సవం

బస్టాప్ ప్రారంభం

యాదగిరిగుట్ట అర్బన్, న్యూస్‌టుడే: ప్రజల అవసరాలను తీరుస్తూ సమస్యలు పరిష్కరించడమే ప్రధాన బాధ్యత అని ఎమ్మెల్యే, విప్ బీర్ల ఐలయ్య అన్నారు. యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో ఏర్పాటు చేసిన శాశ్వత బస్‌స్టాప్‌ను ఆర్టీసీ అధికారులతో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీ బస్సు స్వయంగా నడిపారు.

బీబీనగర్: బీబీనగర్ మండలం మహదేవపురంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సోమవారం పర్యటించారు. అక్కన్న మాదన్న ఉమామహేశ్వర ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం చేపట్టారు. రుక్మిణి సత్యభామ వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు జరిపారు. పూజారులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి దండెం అనిత , ఉపసర్పంచి కరుణాకర్‌రెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ రవణమ్మ, ధర్మకర్తలు, వార్డు సభ్యులు, గ్రామశాఖ అధ్యక్షుడు జహంగీర్ పాల్గొన్నారు.

మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలి ఎన్నిక

గుండాల, న్యూస్‌టుడే: గుండాల మండల మహిళా సమాఖ్య ఎన్నిక ప్రక్రియ మరోసారి నిర్వహించారు. మహిళా మండల సమాఖ్య అధ్యక్షురాలి పదవీకాలం ముగియడంతో ఈ నెల 19న ఎన్నికలు నిర్వహించారు. రాజకీయ నేపథ్యం కలిగి ఉన్న కుటుంబం వ్యక్తిని అధ్యక్షురాలిగా ఎన్నుకున్నట్లు ఆరోపిస్తూ మాజీ అధ్యక్షురాలు కె.రేణుక డీఆర్‌డీవోకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాలతో సోమవారం అధ్యక్షురాలి ఎన్నిక నిర్వహించారు. ఏపీడీ జగ్గారెడ్డి, ఐబీడీపీఎం ప్రభాకర్ పర్యవేక్షించారు. పూర్తిస్థాయి నివేదికను డీఆర్‌డీవోకు అందించనున్నట్లు వారు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వర్లు, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

❖ మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలిగా ఎన్నికైన అంబాల గ్రామానికి చెందిన బీసు మానస భారాసకు అనుకూలమనే కారణంతో ఆలేరు ఎమ్మెల్యే ఆదేశాలతో ఎన్నిక రద్దు చేసినట్లు భారాస జిల్లా నాయకుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మండడి రామకృష్ణారెడ్డి ఆరోపించారు.

మంచినీటి సమస్య పరిష్కారం

తుర్కపల్లి, న్యూస్‌టుడే: తుర్కపల్లి మండలం దత్తాయిపల్లి గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించడానికి బోరుని లీజుకు తీసుకున్నట్లు సర్పంచి జేరిపోతుల కరుణాకర్ తెలిపారు. ప్రత్యేకంగా పైపులైన్ ఏర్పాటు చేసి మిషన్ భగీరథ ట్యాంకుకు అనుసంధానించి గ్రామంలో మంచినీటి ఇబ్బందులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు.

వసతుల కల్పనలో నిర్లక్ష్యం వీడాలి

ఆలేరు: ఆలేరులోని పోచమ్మగుడి అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం వీడాలని బజరంగ్‌దళ్ ఆలేరు ప్రాంత కన్వీనర్ కొమ్ము ప్రవీణ్ అన్నారు. ఆలేరులో సోమవారం జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడారు. పోచమ్మగుడిలో వసతుల కల్పన విషయమై పలుమార్లు పురపాలిక అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లినా పట్టింపులేకుండా పోయిందన్నారు. పవన్, వినయ్, భాస్కర్, ఆనంద్ పాల్గొన్నారు.

70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు LIC
మా పాలసీదారులకు, DO's గారికి, తోటి ఏజెంట్ మిత్రులకు
LIC వారి 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.
అబ్బగాని వెంకట్‌గౌడ్
మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్-భువనగిరి
చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్
MDRT-USA, Cell: 98481 89997

LIC 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
భారతీయ జీవిత బీమా సంస్థ 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా
నా ప్రియమైన పాలసీదారులకు, ఏజెంట్ మిత్రులకు, ఆఫీస్ అధికారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు
1982 నుండి దాదాపు 45 సంవత్సరాలుగా
LICతో నా ప్రయాణం కొనసాగుతోంది.
ఈ సుదీర్ఘ ప్రయాణంలో నాకు
సహకరించిన ప్రతి ఒక్కరికీ
నా హృదయపూర్వక కృతజ్ఞతలు.
నమ్మకానికి ప్రతీక LIC.
ప్రజల జీవితాల్లో భద్రతకు చిరునామా LIC
LIC 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.
G.SOMANARSAIAH
BJP జిల్లా కోశాధికారి, Chief Life Insurance Advisor- LIC
Cell: 99851 42266

(c) eenadu